సాక్షి ప్రకాశం

ఆదివారం । 29 । జనవరి । 2023



సప్త వాహనాలపై చెన్నకేశవస్వామి

మార్కాపురం.. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవస్వామి వెండి రథంపై భక్తులకు దర్శనమిచ్చారు. - 8లో..



సబ్ కలెక్టర్ కారుకు ప్రమాదం

మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్ కారును టిప్పర్ ఢీకొట్టింది. ఆయనకు ప్రమాదం తప్పగా, ముగ్గురికి గాయాలయ్యాయి. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
31/17

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగమంచు కురుస్తుంది. గాలిలో తేమ శాతం అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు యాదవ ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న పీఎల్‌పీ యాదవ్

మార్కాపురం: మార్కాపురంలోని టీటీడీ కళ్యాణ మండపంలో ఆదివారం సాయంత్రం 4 గంటలకు యాదవ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు యాదవ సంఘ రాష్ట్ర నాయకుడు, వైఎస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి పీఎల్‌పీ యాదవ్ తెలిపారు. మార్కాపురంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎంపీ బీదా మస్తాన్‌రావు, ఎమ్మెల్యేలు బుర్రా మధుసూదన్‌యాదవ్, పార్థసారధి, ఎమ్మెల్సీ జంగ కృష్ణమూర్తి, వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరవుతారని చెప్పారు. యాదవుల అభ్యున్నతికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తామన్నారు. జిల్లాలోని యాదవులంతా హాజరుకావాలని కోరారు. మీడియా సమావేశంలో సంఘ నాయకులు గురుప్రసాద్, గంగరాజు, వెంకటరాజు, పోలయ్య, నాగేశ్వరరావు, నాళి కొండయ్య, బుర్రి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి కృషి చేయాలి



పోలీసు అధికారులతో సమీక్షిస్తున్న న్యాయమూర్తి శివకుమార్

ఒంగోలు: ఇరువర్గాల ఆమోదంతో కేసుల పరిష్కారానికి జిల్లా పోలీసు యంత్రాంగం కృషి చేయాలని ఒకటో అదనపు జిల్లా న్యాయమూర్తి ఆర్.శివకుమార్ సూచించారు. స్థానిక జిల్లా న్యాయస్థానంలో పోలీసు అధికారులతో శనివారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 11న దేశవ్యాప్తంగా నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా జిల్లావ్యాప్తంగా అన్ని న్యాయస్థానాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. రాజీపడేందుకు అర్హత ఉన్న క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, మోటారు వాహనాల ప్రమాద బీమా పరిహార చెల్లింపు కేసులు, వివాహ సంబంధ వ్యాజ్యాలు, అన్ని రకాల సివిల్ కేసులను ఇరువర్గాల కక్షిదారుల ఆమోదంతో పరిష్కరించాలని సూచించారు. న్యాయస్థానాల్లో పెండింగ్ కేసులున్న వారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని వ్యాజ్యాలను పరిష్కరించుకోవాలన్నారు. పోలీసు అధికారులు, రెవెన్యూ అధికారులు, వారి సిబ్బంది ఎక్కువ సంఖ్యలో కేసుల పరిష్కారానికి న్యాయశాఖకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.శ్యాంబాబు, ఎక్సైజ్ మేజిస్ట్రేట్ వెంకటేశ్వరశర్మ, ఒంగోలు, చీరాల, కందుకూరు సబ్‌డివిజనల్ పోలీసు అధికారులు, ఒంగోలు పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



పాకల సముద్రతీరం

వలను మోసుకొస్తున్న జాలర్లు

SUNDAY Special

అలల సాగరంపై బతుకు విన్యాసం

కడలి పుత్రుల జీవనం విలక్షణం

- సముద్రమే వీరి జీవనాధారం
- వేటలో ఎన్ని మెళకువలో
- వేట సాగితే పండుగే...
- ఒక్కో వలకు ఒక్కో సైజు కన్ను
- ఐలా, రింగుల, కొనాము వలలతో భారీగా వేట
- మారుతున్న జీవన విధానం



టైగర్ రొయ్యలు

కడలే వారికి అమ్మ ఒడి. అలల సవ్వడులు వారికి జోలపాట. సాగరంలో వేటే జీవనంగా సాగుతున్న మత్స్యకారుల జీవనశైలి అంతా విభిన్నం. ఇల్లు వదిలి సముద్రంలోకి వెళ్లి.. తిరిగొచ్చే వరకు అనుక్షణం ప్రకృతి విసిరే సవాళ్లను ఎదుర్కొంటూ నిత్యం ఆటుపోటుల మధ్య సాగే వీరి జీవనం ఓ సమరం. గంగమ్మ చెంత మత్స్యకారుల దిన చర్య అర్ధరాత్రి నుంచే ఆరంభమవుతుంది. నడి సంద్రం సాక్షిగా వీరు సాగించే జీవన తెరను ఒక్కసారి తెరిస్తే ఎన్నెన్నో ఆసక్తికరమైన విషయాలు వెలుగుచూస్తాయి. వీరు వినియోగించే వల దగ్గర నుంచి సాగరంలో సాగించే వేట వరకూ అన్నీ విభిన్నం..విలక్షణమే.. ఇంకెందుకాలస్యం సముద్ర తీరానికి పోదాంపదండి...

– ఒంగోలు డెస్క్

సింగరాయకొండ మండలం పాకల సముద్రతీరం. ఇక్కడ చిన్నా..పెద్దా, ఆడ..మగా అనే తేడా లేకుండా అందరూ వేట పనుల్లో నిమగ్నమై ఉన్నారు. కొంత మంది తెల్లవారుజామునే వేటకు వెళితే.. మరికొంత మంది రేపటి కోసం వలలను సిద్ధం చేస్తూ కనిపించారు. మరికొందరు పడవలను శుభ్రం చేస్తున్నారు. వేటకు వెళ్లిన వారు క్షేమంగా తిరిగొచ్చిన విషయం తెలిసిన వెంటనే వారి కుటుంబ సభ్యులు భోజనాలతో తీరానికి వస్తారు. అక్కడే అందరూ కలిసి భోజనాలు చేస్తారు. ఇక్కడ జీవనం సాగిస్తున్న గంగపుత్రులను పలకరిస్తే వారి బతుకుల్లో విలక్షణత కనిపించింది. కడలిలో వందల కిలోమీటర్లు రోజుల తరబడి వీరు చేస్తున్న సాహసం తెలుస్తుంది. చేపల వేటే జీవనంగా మార్చుకున్న గంగపుత్రులకు వేట విరామ సమయమే విశ్రాంతి. ఎగిసిపడే కెరటాలను అవలీలగా దాటి కడలిని సునాయాసంగా ఈదే మత్స్యకారుల బతుకు ప్రకృతి విపత్తుల మధ్య పెనుసవాలే..



తీరంలోనే కుటుంబమంతా భోజనం

అంతా విలక్షణం...

అందరిదీ ఒక్కటే మాట..బాట. ఒక్క మాటలో చెప్పాలంటే.. పెద్దకాపు తీసుకున్న నిర్ణయమే శాసనం. తప్పొప్పులు జరిగితే.. పరిష్కరించేందుకు వీరు పోలీస్‌స్టేషన్ల మెట్లు ఎక్కేది ఉండదు. కట్టుబాటును ఎవరూ ధిక్కరించరు. పెద్ద కాపు, నడింకాపు, చిన్నకాపు.. ఇలా ఊరిలో ముగ్గురిని గ్రామ పెద్దలుగా ఏకగ్రీవంగా ఎన్నుకుంటారు. వీరు చెప్పిందే ఆ ఊరందరికీ వేదం. చేసిన తప్పులకు వీరు వేసే శిక్ష వారిలో మార్పు తీసుకొచ్చే విధంగా ఉంటుంది. గ్రామ పెద్దలు ఒక నిర్ణయం తీసుకుంటే ఆ ఊరంతా అనుసరించాల్సిందే.



వేట ముగించుకొని వస్తూ..

వల..వలకూ ప్రత్యేకమే...

మత్స్య సంపదను వేటాడటానికి రకరకాల వలలు వినియోగిస్తారు. చేపలు, రొయ్యలు, పీతలు ఒక్కొక్కదానికి ఒక్కో వలను వేటకు వాడతారు. ఏ వల కొనుగోలు చేయాలన్నా రూ.లక్షల్లోనే మరి. వేట సరిగ్గా సాగితే అది పెద్దలెక్కలోదేమీ కాదు. సంప్రదాయ మత్స్యకారులు వాడే వలలు పులసల వల, నరంవల, బాడీవల, సన్నకన్నుల వల, ఐలావల, రింగుల వల, కొనాము వల. వీటిల్లో అత్యంత ఖరీదైంది 'ఐలా వల'. దీని ఖరీదు దాదాపు రూ.రెండు లక్షలు ఉంటుంది. అంటే ఒక్కో వల అతి తక్కువ పొడవు అంటే ఒక కిలో మీటరు. ఇక పొడవు పెరిగే కొద్దీ ధర పెరుగుతూ ఉంటుంది. దీనితో సముద్రం ఒడ్డున ఉండి మరీ వేట సాగిస్తారు. ఈ వలను సముద్రంలో రెండుమూడు పడవల్లో వేసుకుని ఎంత పొడవు ఉంటే అంత దూరంలో సముద్రంలో వదులుకుంటూ వెళ్తారు. ఒడ్డున ఉండి మత్స్యకారులు ఒక చివర పట్టుకుని ఉంటే.. రెండో చివర మరో పక్కన ఒడ్డునే ఉండి మరికొంతమంది మత్స్యకారులు పట్టుకుంటారు. సముద్రంలో వదిలిన వలను రెండు అంచులు పట్టుకుని లాగుతారు. ఐలా, రింగుల, కొనాము వలను లాగడానికి దాదాపు 50 మందికిపైగా మత్స్యకారులు కావాలి. కాకినాడ నుంచి ప్రత్యేకంగా మత్స్యకారులను తీసుకొచ్చి వేటకు వెళ్తారు. సుదూర ప్రాంతం ప్రయాణించాల్సి ఉంటుంది. ఈ వలల యజమానికి అత్యంత ఖర్చుతో కూడుకున్న పని. మత్స్య సంపద పడితే ఊపిరి పీల్చుకుంటాడు. లేకుంటే మళ్లీ రెండో ప్రయత్నమే మరి. పీతలు, చిన్నచేపలు, రొయ్యల కోసం ముందు రోజు లంగరు వేసి తర్వాత రోజు ఉదయాన్నే సముద్రంలోకి వెళ్లి మత్స్యసంపద తీసుకొస్తారు. ఇలా తీసుకొచ్చిన మత్స్య సంపదను ఊర్లో ఉన్న వ్యాపారులకు ఇస్తారు. వారు సరుకును బట్టి ప్రత్యేక వాహనాల్లో బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, ఒడిస్సా పంపిస్తుంటారు.



వలలు సిద్ధం చేస్తున్న మత్స్యకారులు



వేటకు వెళ్ల వచ్చిన బోటు నుంచి వలను తీస్తూ..

పడవలోనే వంటా వార్పూ...

సుదూర ప్రాంతాలకు వేట కోసం వెళ్లేవారు ముందుగానే పడవలో వంట సరుకులు తీసుకువెళ్తారు. అందులోనే వంటా వార్పూ. తమ వెంట తీసుకెళ్లిన పప్పులు, కూరగాయలతోనే కాకుండా సముద్రంలో లభించే చేపలు, రొయ్యలను సైతం వండుకుని తింటారు. అంతేకాదు వీరికి ప్రత్యేక భాష ఉంటుంది. తమిళం కలిపి వీరు మాట్లాడుతుంటారు.

ఎంతో మార్పు...

రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. మత్స్యకారుల జీవితాల్లో ఎంతో మార్పు వచ్చింది. వేట విరామ సమయంలో గత ప్రభుత్వాలు అరకొరగా.. అదీ ఏడాదికి రూ.4 వేలు ఆర్థిక సాయం, 20 కేజీల బియ్యం ఇచ్చి చేతులు దులుపుకునేవి. ప్రస్తుతం వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం ద్వారా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఏటా రూ.10 వేల ఆర్థిక సాయం అందిస్తున్నారు. వేట బోట్లకు డీజిల్ సబ్సిడీని గణనీయంగా పెంచారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతే రూ.10 లక్షల పరిహారం అందిస్తోంది. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన ద్వారా రూ.3.30 లక్షల విలువైన బోటు, మోటార్లు, వలలు రాయితీపై అందిస్తోంది. మెకనైజ్డ్ బోట్ల పంపిణీకి కూడా రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. ప్రభుత్వం ఇస్తున్న అమ్మఒడితో పిల్లలు చదువుకు వెళ్తున్నారు.

విరామ సమయంలో...

వేట విరామ సమయంలో కూడా మత్స్యకారులు అందుబాటులో ఉన్న ఆక్వా కల్చర్‌కు, వ్యవసాయ, ఉపాధి పనుల్లో కూలీలుగా వెళ్తారు. మరికొందరు రొయ్యల చెరువుల్లో రొయ్యలు పట్టడం, ప్యాకింగ్ చేయడం, ఇతరత్రా పనులకు వెళ్తారు. ఆయా పనులు దొరకని పక్షంలో ఆటలతో కాలక్షేపం చేస్తుంటారు.

చాకిరీ ఎక్కువ.. ఆదాయం తక్కువ



ఉదయం ఆరు గంటలకు చేపల వేటకు బోటులో ఇద్దరం వెళ్లాం. ప్రస్తుతం పీతలు మాత్రమే పడ్డాయి. పీతలు పెద్దసైజు అయితే కేజీ రూ.150 ఉండగా, చిన్న సైజు కేజీ రూ.60 మాత్రమే. పీతలు పడితే చాకిరీ ఎక్కువ.. ఆదాయం తక్కువ.

– అల్లూరి లక్ష్మణ్, పోతయ్యగారిపట్టపుపాలెం, పాకల

జిల్లాలో తీర ప్రాంత మండలాలు	5
నాగులుప్పలపాడు, సింగరాయకొండ కొత్తపట్నం, టంగుటూరు, ఒంగోలు	
తీర ప్రాంతం	52 కిలోమీటర్లు
మత్స్యకార గ్రామాలు 35	మత్స్యకార కుటుంబాలు 10 వేలు

శాపంగా తమిళనాడు బోట్లు...



చేపల వేట ప్రస్తుతం ఆశాజనకంగా లేదు. సముద్రంలో చాలా దూరం వెళ్లి వలలు వేస్తేనే చేపలు లభిస్తున్నాయి. ఈలోగా తమిళనాడు రాష్ట్రానికి చెందిన కడలూరు జాలర్లు సోనా బోట్లతో నిబంధనలు అతిక్రమించి తీరానికి సమీపంలో చేపల వేట చేయడంతో లక్షలాది రూపాయల విలువ గల వలలు ధ్వంసమై తీవ్రంగా నష్టపోతున్నాం. చెన్నై బోట్లు తీరంలో వేటాడకుండా ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపాలి.

– ప్రళయ కావేరి రోశయ్య, పోతయ్యగారిపట్టపుపాలెం, పాకల

రోజూ రూ.200 సంపాదన



ఇంటింటికి తిరిగి చేపలు అమ్ముకుంటూ జీవిస్తాను. చేపల వేట సాగించి తీరానికి వచ్చిన బోట్ల మత్స్యకారులకు బఠానీలు వంటి తినుబండారాలు ఇచ్చి వారి వద్ద నుంచి చేపలు తీసుకెళ్లి అమ్ముకుంటాను. రోజుకు 150 నుంచి 200 రూపాయలు సంపాదిస్తాను. నాకు వృద్ధాప్య పింఛన్ రూ.2,750 వస్తుంది.

– వాటిపల్లి పోలేరమ్మ, పోతయ్యగారిపట్టపుపాలెం, పాకల

గడప గడపలో ఆప్యాయత

ఒంగోలు సబర్బన్: గడపగడపలో ఆప్యాయత.. వాసన్నా అంటూ ఆత్మీయ పలకరింపు... ఒంగోలు నగరంలో శనివారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిని తమ కుటుంబ సభ్యునిలా ప్రజలు ఆదరించారు. 31వ డివిజన్ పరిధిలోని సీఆర్పీ క్వార్టర్స్, విజయనగరకాలనీలో స్థానిక కార్పొరేటర్ తన్నీరు నాగజ్యోతి నాగేశ్వరరావుతో కలిసి ఇంటింటికి వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన గురించి ప్రజలనడిగి బాలినేని తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై నేరుగా ప్రజలను ఆరా తీశారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేపట్టని విధంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్నారని ప్రజలకు వివరించారు. అన్ని పథకాలు సక్రమంగా అందుతున్నాయని, ఒకటో తేదీనే వలంటీర్లు ఇంటికొచ్చి పింఛన్లు ఇచ్చిపోతున్నారని లబ్ధిదారులు, వృద్ధులు, వికలాంగులు సంతోషంగా బాలినేనికి తెలిపారు. సంక్షేమ పథకాలు అందకుంటే చెప్పాలని, ఇంకేమైనా సమస్యలున్నా తెలియజేయాలని, వెంటనే పరిష్కరిస్తామని ప్రజలను బాలినేని కోరారు. పలువురు వ్యక్తిగత సమస్యలను సైతం బాలినేని దృష్టికి తీసుకురాగా, ఆయన స్పందించి అక్కడికక్కడే పరిష్కరించి ప్రజల మన్ననలు పొందారు. మళ్లీ ఒంగోలు ఎమ్మెల్యేగా మీరే రావాలంటూ జనం ఆశీర్వదించారు. ఒంగోలు నగర ప్రజల చిరకాల కోరిక అయిన మంచినీటి సమస్య శాశ్వత పరిష్కారానికి సీఎం వైఎస్ జగన్ రూ.339 కోట్లు మంజూరు చేశారని స్థానికులకు బాలినేని వివరించారు. విజయనగర్ కాలనీలోని రైల్వే పట్టాల రోడ్డులో మంచినీరు సక్రమంగా రావడం లేదని మహిళలు బాలినేని దృష్టికి తీసుకురాగా, అక్కడే ఉన్న నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావును పిలిచి మంచినీటి సమస్యకు కారణాలేంటని అడిగారు. పైపులైన్ పొడిగించాల్సి ఉందని, ఇంటర్ లింక్ ఏర్పాటు చేసి మంచినీటి సమస్య లేకుండా వారం లోగా చర్యలు తీసుకుంటామని బాలినేనికి డీఈఈ పద్మజ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంగోలు నగరంలో మంచినీటి సమస్య శాశ్వత పరిష్కారానికి నిధులు మంజూరైన విషయాన్ని స్థానికులకు వివరించారు. విజయనగరకాలనీలోని రైల్వే పట్టాల రోడ్డులో రూ.10 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డు, సీసీ డ్రెయిన్‌ను బాలినేని ప్రారంభించారు. స్థానికులు బోరు కావాలని అడగడంతో వెంటనే బోరు వేయించాలని కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావును ఆదేశించారు. వారం రోజుల్లో బోరు వేయిస్తామని స్థానికులకు భరోసా ఇచ్చారు.

కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు, వైఎస్సార్ సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు కఠారి శంకర్, ఏపీఐఐసీ కార్పొరేషన్ సభ్యులు ముప్పా స్వాతి, కార్పొరేటర్లు యనమల నాగరాజు, ఈదర చిన్నారి, గోపీచంద్, జడా వెంకట్, తాడి కృష్ణలత, నాగం వెంకట శేషయ్య, గోపిరెడ్డి గోపాలరెడ్డి, గోలి లక్ష్మీకోటేశ్వరమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు జిల్లెళ్లమూడి రమాదేవి, బొప్పరాజు జ్యోతి, గొర్రెపాటి శ్రీనివాసులు, మైనారిటీ మహబూబ్‌బాషా, పసుపులేటి శ్రీనివాసులు, విస్సు, మోడుబోయిన సురేష్, తమ్మినేని మాధవి, పోతంశెట్టి వెంకటరత్నం, బొమ్మినేని మురళి, తూము పద్మ, బైరెడ్డి అరుణ, బేదపూడి రాజేశ్వరి, అక్కిరెడ్డి, గోలి తిరుపతిరావు, దేవరపల్లి అంజిరెడ్డి, నజీరు, మీరావలి, జి.స్వరూప్, మిడసల మధుబాబు, గుంజి ఏడుకొండలు, బండారు శ్రీరాములు, కొమ్ము రవి, బండారు మల్లికార్జునరావు, బడుగు ఇందిర, కొమ్మూరి రవిచంద్ర, కొమ్ము రాజీవ్, దాసు, విజయ, కుమారు, కట్టా రాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

క్లుప్తంగా

వీఆర్‌కు కానిస్టేబుల్, హోంగార్డు

అర్ధవీడు(కంభం): పోలీసులు కొట్టారనే మనస్తాపంతో వ్యక్తి మృతి చెందాడన్న ఆరోపణలు రావడంతో శుక్రవారం కాకర్ల, అర్ధవీడులో ఒంగోలు దిశ డీఎస్పీ పల్లపురాజు, కంభం సీఐ యం. రాజేష్ విచారణ చేపట్టి ఎస్పీకి రిపోర్టు సమర్పించారు. ఈ నేపథ్యంలో శనివారం ఆరోపణలు ఎదుర్కొంటున్న కానిస్టేబుల్ నరసింహారావు, హోంగార్డు ఖాసింను వీఆర్‌కు పిలిపించినట్లు తెలిసింది. కాగా వ్యాస్‌మాల్ తాగి చికిత్స పొందుతూ మృతి చెందిన కాకర్లకు చెందిన మండ్లా లక్ష్మయ్య మృతదేహానికి శనివారం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించి అతని స్వగ్రామం నంద్యాల జిల్లా మాడుగుల గ్రామానికి తీసుకెళ్లారు.

ఉద్యోగం రాలేదని యువకుడు ఆత్మహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రామకృష్ణ

దర్శి: ఉద్యోగం రాలేదని బెల్లంకొండ కిరణ్ కుమార్ (22)అనే యువకుడు ఆత్మహత్య హత్య చేసుకున్న సంఘటన దర్శి పట్టణంలోని బాలాజీ వెంచర్‌లో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు.. కొంతకాలంగా ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నా.. రాలేదనే మనస్థాపం చెంది ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని తండ్రి బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఏపీ సీఎం కప్ జిల్లా క్రీడాకారుల ఎంపిక రేపు

ఒంగోలు: ఏపీ సీఎం కప్ జిల్లా క్రీడాకారుల ఎంపిక ఈనెల 30న స్థానిక మినీ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు స్టెప్ చీఫ్ కోచ్ జి.రాజరాజేశ్వరి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కబడ్డీ, వాలీబాల్, హ్యాండ్‌బాల్, అథ్లెటిక్స్, బాల్‌బ్యాడ్మింటన్ సీనియర్స్ విభాగంలో ఈ ఎంపిక ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు నంబర్ 9121106840ను సంప్రదించాలన్నారు.

అసోంలోని ఎస్పీ రాకేష్ రెడ్డికి అవార్డు



అవార్డు అందుకుంటున్న రాకేష్‌రెడ్డి

మార్కాపురం: పట్టణానికి చెందిన విశ్రాంత వయోజన విద్య ఉప సంచాలకులు వీరారెడ్డి కుమారుడు, ప్రస్తుత అసోంలోని గోల్పర ఎస్పీగా పనిచేస్తున్న రాకేష్‌రెడ్డి శుక్రవారం రాత్రి ఆ రాష్ట్ర డీజీపీ భాస్కర్ జ్యోతి మహంత చేతుల మీదుగా అసోం పోలీస్ శిశుమిత్ర లీడర్‌షిప్ అవార్డును అందుకున్నారు. ఆయనను పలువురు అభినందించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ సమర్థవంతంగా అమలు చేసినందుకు ఈ అవార్డు అందుకున్నారు.

జియో స్తంభాన్ని ఢీకొన్న బుల్లెట్ వాహనం

- బాలుడు మృతి


స్తంభాన్ని ఢీకొని మృతి చెందిన వెంకటేష్

ఒంగోలు టౌన్: బుల్లెట్ వాహనం అదుపుతప్పి స్తంభానికి ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు . పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక కేశవరాజుపేటకు చెందిన ఉమ్మడిశెట్టి వెంకటేష్ (17) పదో తరగతి వరకు చదువుకొని ఇంటి వద్ద ఉంటున్నాడు. శనివారం అర్ధరాత్రి గద్దలగుంటలోని మిత్రుడి వద్దకు వెళ్లాడు. బుల్లెట్‌పై ఇంటికి బయలు దేరగా అదుపుతప్పి వీఐపీ రోడ్డులోని జియో టెలిఫోన్ స్తంభానికి ఢీకొన్నాడు. తీవ్రమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకటేష్ తండ్రి అంకబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజ్‌కుమార్ కేసు నమోదు చేసుకొని ఫిర్యాదు చేస్తున్నారు.

ఉత్సాహంగా టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు


తమిళనాడు, ఉత్తరప్రదేశ్ బాలుర జట్లు

ఒంగోలు: జాతీయ స్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలు రెండోరోజైన శనివారం స్థానిక పీవీఆర్ గ్రౌండ్‌లో ఉత్సాహంగా సాగాయి. పురుషుల విభాగంలో ఉత్తర ప్రదేశ్, పాండిచ్చేరి జట్లు సెమీ ఫైనల్‌కు చేరుకున్నాయి. మహారాష్ట్ర-కర్ణాటక, గోవా-ఉత్తరాఖండ్ జట్ల మధ్య జరిగే మరో రెండు మ్యాచ్‌లలో విజేతలు సెమీ ఫైనల్స్‌కు చేరుకోవాల్సి ఉంది. ఆదివారం ఉదయం సెమీఫైనల్స్, ఫైనల్స్ నిర్వహించనున్నారు. మహిళల విభాగంలో మహారాష్ట్ర-ఉత్తరప్రదేశ్ జట్లు చేరుకున్నాయి. మూడో స్థానానికి ఏపీ, తమిళనాడు జట్లను ప్రకటించారు.

సప్త వాహనాలపై చెన్నకేశవ స్వామి

- వైభవంగా రథసప్తమి వేడుకలు
- దర్శించుకున్న మంత్రి సురేష్, ఎమ్మెల్యేలు కేపీ, అన్నా


స్వామివారి పల్లకీ మోస్తున్న మంత్రి సురేష్, ఎమ్మెల్యే కేపీ

మార్కాపురం టౌన్: రథసప్తమి పురస్కరించుకుని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మి చెన్నకేశవ స్వామి వారు వెండి రథంపై భక్తులకు దర్శనమిచ్చారు. రథసప్తమి సందర్భంగా శనివారం పట్టణంలోని నాలుగు మాడ వీధుల్లో వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమివ్వగా తిలకించేందుకు వేలాదిగా భక్తులు తరలి వచ్చారు. ఉదయం సూర్యప్రభ, శేష, గరుడ, హనుమంత, చక్రస్నానం, కల్పవృక్ష వాహనంపై చెన్నకేశవ స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం చక్రస్నానాన్ని అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు, రంగాచార్యులు, వేణుగోపాల చార్యులు, అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం చంద్రప్రభ వాహనంపై దర్శనమిచ్చారు. తిరుమల తరహాలో వెండితో తయారు చేసిన రథంపై నగరోత్సవం నిర్వహించారు. ఉదయం సేవల్లో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్యేలు కేపీ నాగార్జునరెడ్డి, అన్నా రాంబాబులు పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి వెన్నా హనుమారెడ్డి, ఆలయ చైర్మన్ కేశవరావు, ఉత్సవాల కమిటీ చైర్మన్ కాశీవిశ్వనాథం, ఈవో జి. శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీ కృష్ణ, వైస్ చైర్మన్ అంజమ్మ శ్రీనివాసులు, చిన్న తరహా పరిశ్రమల శాఖ డైరెక్టర్ మేడా బద్రినాథ్, ధర్మకర్తలు పెరుమాళ్ళ సురేష్, అర్జునరావు, ధర్మకర్తలు, కమిటీ ప్రతినిధులు వి.రామకృష్ణా, కొత్తకృష్ణ, ఆర్.రమేష్, ఎస్.రమేష్, బొగ్గరపు శేషయ్య, బచ్చు జనార్దన్, బొంతల సుధీర్, చాటకొండ చంద్రశేఖర్, కె.కృష్ణయ్య, బి.వెంకటేశ్వరరావు, పలువురు కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. భద్రతా ఏర్పాట్లను డీఎస్పీ కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో సీఐ భీమానాయక్, సబ్ డివిజన్‌లోని ఎస్సైలు, పోలీసులు, సహాయ కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది పరిశీలించారు. విద్యార్థుల కోలాటం, నృత్యాలు అలరించాయి. తీన్‌మార్ డప్పులు, గుంటూరు, నరసరావుపేట నుంచి వచ్చిన పాటకచేరీలు జరిగాయి.


స్వామివారి సేవలో ఎమ్మెల్యే రాంబాబు

మహా దానం అన్నదానం

పట్టణంలో అనేక ప్రాంతాల్లో అల్పాహారం, మధ్యాహ్నం అన్నవితరణ, సాయంత్రం అల్పాహారాన్ని, వివిధ అసోసియేషన్, కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించారు. పట్టణంలో మెయిన్‌బజార్, నెహ్రూబజార్, రాఘవేంద్ర స్వామి గుడి వీధి, నాయుడు వీధి, శివాలయం వీధి, అయ్యప్పస్వామి దేవస్థానం, చిన్న రామస్వామి దేవస్థానం, పెద్ద రామస్వామి దేవస్థానం, రీడింగ్ రూం, ఎరువుల దుకాణాల అసోసియేషన్, చెన్నకేశవ స్వామి వారి కల్యాణ సేవా సంఘం, కొత్త మార్కెట్, ముఖ్య ప్రాంతాల్లో పెద్ద ఎత్తున జరిగాయి.

మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో..

రథసప్తమి పురస్కరించుకుని కమిషనర్ గిరికుమార్ ఆధ్వర్యంలో సిబ్బందితో పారిశుద్ధ్య నిర్వహణను సజావుగా జరిపించారు. అన్నదాన కమిటీల వద్ద ప్రత్యేక డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేసి తమ సిబ్బందిచే వ్యర్థాలను తొలగింపచేశారు.

తిరుమల రథ సప్తమి వేడుకల్లో బుర్రా

కనిగిరి రూరల్: తిరుమల తిరుపతి దేవస్థానంలో జరిగిన రథ సప్తమి వేడుకల్లో ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్, లక్ష్మి దంపతులు శనివారం పాల్గొన్నారు. విశిష్ట పూజలు చేసిన అనంతరం తిరుమల నాలుగు మాడ వీధుల్లో సప్తవాహన శ్రీ దేవి, భూదేవి సమేత మలయప్ప స్వాముల ప్రత్యేక ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.


తిరుమలలో ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్, లక్ష్మి దంపతులు


సూర్యప్రభ వాహనంపై చెన్నకేశవ స్వామి వారు


ఉత్సవం వెంట భక్తులు

సబ్ కలెక్టర్ కారుకు ప్రమాదం

- మార్కాపురం సబ్ కలెక్టర్ కారును ఢీ కొట్టిన టిప్పర్
- ఆయనకు తప్పిన ప్రమాదం
- మరో ముగ్గురికి గాయాలు


సబ్‌కలెక్టరు సేతు మాధవన్

పొదిలి రూరల్: మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్ ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. ఆయన వాహనాన్ని ఎదురుగా వస్తున్న టిప్పరు ఢీ కొనడంతో అందులోని ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన పొదిలి మండలంలోని ఉప్పలపాడు గ్రామ సమీపంలోని ప్రసన్నాంజనేయ స్వామి గుడి వద్ద (మర్రి చెట్లపాలెం బ్రిడ్జి) ఒంగోలు-కర్నూలు రహదారిపై శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్ ఒంగోలులో జరిగే సమావేశానికి వెళుతున్నారు. ఆదే సమయంలో అటువైపు నుంచి ఎదురుగా వస్తున్న టిప్పరు మర్రిచెట్లపాలెం బ్రిడ్జి దగ్గరకు వచ్చే సరికి కారును బలంగా ఢీ కొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న దఫేదార్ బెన్హర్ బాబు, డ్రైవర్ జాన్ బాష, సీసీ మహబూబ్ బాషకు గాయాలయ్యాయి. సబ్ కలెక్టరు సేతు మాధవన్ సురక్షితంగా బయట పడ్డారు. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతిని ఇరుక్కుపోయింది. స్థానికులు కారులో ఉన్న వారిని బయటకు తీయగా 108 బృందం వారు క్షతగాత్రులను వెంటనే చీమకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతున్నారు. డ్రైవరు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వెంకటేశ్వరరెడ్డి చెప్పారు.


టిప్పరు లోపలికి చొచ్చుకు పోయిన కారు


చికిత్స పొందుతున్న సబ్‌కలెక్టర్‌ను పరామర్శించిన కలెక్టర్ దినేష్‌కుమార్

క్షతగాత్రులను పరామర్శించిన కలెక్టర్

ఒంగోలు అర్బన్: జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న క్షతగ్రాత్రులను కలెక్టర్ దినేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ పరామర్శించారు. ఒంగోలులోని ప్రకాశం భవనంలో జరిగే సమావేశానికి హాజరయ్యేందుకు వస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. సబ్ కలెక్టర్ సీటు బెల్ట్ పెట్టుకోవడంతో సురక్షితంగా బయపడ్డారు. డ్రైవర్ బాషకు చేతులకు, దఫేదార్ బెన్హర్‌కు కంటి వద్ద తీవ్ర గాయాలయ్యాని వైద్యులు తెలిపారు. ఒంగోలు ఆర్‌డీఓ విశ్వేశ్వరరావు, ఒంగోలు తహసీల్దారు మురళి ఇతర అధికారులు పరామర్శించిన వారిలో ఉన్నారు. ప్రమాదానికి గల కారణాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు.

పెద్ద పులి కోసం ముమ్మర గాలింపు

అర్ధవీడు: మండలంలోని నల్లమల అటవీ ప్రాంత సమీపంలోని గ్రామాల్లో పదిరోజులుగా సంచరిస్తున్న పెద్ద పులి కోసం ఫారెస్ట్ అధికారులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం మార్కాపురం ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని అర్ధవీడు మండలం మాగుటూరు, లక్ష్మీపురం అటవీ పరిసరాల్లో పర్యటించిన అధికారులు.. పులి సంచరిస్తున్న ప్రదేశాలను గుర్తించారు. శంకరాపురం-మాగుటూరు అటవీ ప్రాంతం సమీపంలో ఉన్న కొమటికుంట వద్దకు పులి వచ్చి నీరు తాగి వెళ్తున్నట్లు గమనించారు. ఆ కుంట లక్ష్మీపురం గ్రామానికి కూతవేటు దూరంలో ఉండటంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. పది చోట్ల ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశామని ఫారెస్ట్ అధికారి ప్రసాద్‌రెడ్డి తెలిపారు.



అటవీ ప్రాంతంలో ట్రాప్ కెమెరాలు పెడుతున్న అధికారులు

వెలగలపాయ లోయలో..

మార్కాపురం ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని మాగుటూరు, లక్ష్మీపురం ప్రాంతాల్లో పులి సంచరిస్తున్న నేపథ్యంలో ఆ సరిహద్దులోని తురిమెళ్ల అటవీ క్షేత్ర అధికారిణి మధుప్రియాంక, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ మంగేనాయక్ సిబ్బందితో కలిసి తురిమెళ్ల ఫారెస్టు పరిధిలోని వెలగలపాయ పరిధిలోని అటవీ ప్రాంతాలను పరిశీలించారు. గస్తీ ఏర్పాటు చేశామని ఆందోళన చెందాల్సిన పనిలేదని అన్నారు. ఈ ప్రాంతంలో పులి సంచారం లేదని తెలిపారు. ఎవరికైనా పులి కనిపిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని సూచించారు.

ఉత్సాహంగా ఎడ్ల పోటీలు

సీఎస్‌పురం: మండలంలోని జంగంవారిపల్లిలో శనివారం ఎడ్ల బండలాగుడు పోటీలు ఉత్సాహంగా సాగాయి. శ్రీ పట్టాభిరామచంద్ర స్వామి వారి తృతీయ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని జంగంవారిపల్లిలో శనివారం రాష్ట్ర స్థాయిలో ఎడ్లతో బండలాగుడు పోటీలు నిర్వహించారు. వైస్ ఎంపీపీ దుగ్గిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, నారాయణస్వామి ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి పాలకొల్లు వెంకటేశ్వరరెడ్డి పోటీలను ప్రారంభించారు. వైఎస్సార్ కడప జిల్లా, కీర్తిపల్లి గ్రామానికి చెందిన చిట్టిబోయిన భరత్‌కుమార్ యాదవ్ ఎడ్లు 2,863 అడుగులతో ప్రథమ స్థానం సాధించాయి. అదే జిల్లా, ఆనంవారిపల్లి గ్రామానికి చెందిన శీలం జగన్మోహన్‌రెడ్డి ఎడ్లు 2,800 అడుగులతో ద్వితీయ స్థానం, ప్రకాశం జిల్లా, బ్రాహ్మణ పల్లికి చెందిన దప్పిలి అంజిరెడ్డి ఎడ్లు 2,800 అడుగులతో తృతీయ స్థానం సాధించాయి. సుంకేశుల గ్రామానికి చెందిన శ్రీనివాసులు ఎడ్లు 2,675 అడుగులతో నాలుగు, నంద్యాల జిల్లా, పి.ఆర్ పల్లికి చెందిన శివకోటి ఎడ్లు 2,576 అడుగులతో ఐదో స్థానం పొందాయి. కత్తులపల్లి వెంకటేశ్వరరెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారులు రూ. 60 వేలు, గ్రామస్తుల సహకారంతో రూ. 40 వేలు, రూ. 30 వేలు, రూ. 20 వేలు, రూ. 10 వేలను వరుస బహుమతులుగా అందజేశారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భువనగిరి వెంకటయ్య, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు చెరుకుపల్లి రాధాకృష్ణా రెడ్డి, బోయమడుగుల, నల్లమడుగుల ఎంపీటీసీ తిరుపతిరెడ్డి, ముదుమాల రాములమ్మ నారాయణరెడ్డి, అరివేముల సర్పంచ్ సన్నపురెడ్డి రాధారుక్మిణమ్మ పాల్గొన్నారు.


ఎడ్ల పోటీలను ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ ప్రతాప్ రెడ్డి

పనులు తనిఖీ చేసిన కేంద్ర బృందం


నందనవనంలో జరిగిన ఉపాధి పనులు పరిశీలిస్తున్న సెంట్రల్ టీం సభ్యులు


నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలిస్తున్న టీం అధికారులు

హనుమంతునిపాడు: మండలంలో కేంద్ర ప్రభుత్వం నిధులతో జరిగిన వివిధ పనులను (ఎన్ఎల్ఎం) నేషనల్ లెవల్ మానిటరింగ్ తనిఖీ టీం సభ్యులు శనివారం నందనవనం, కూటాగుండ్ల గ్రామాల్లో తనిఖీ చేశారు. ముందుగా వివిధ శాఖల అధికారులు, పంచాయతీ వార్డు సభ్యులు, కార్యదర్శులతో ముందుగా సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో కేంద్ర ప్రభుత్వం నిధులతో జరిగిన వివిధ పనులపై ఏఏ పనులు జరిగాయి అని అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీకి వచ్చిన నిధులతో జరిగిన డెవలప్‌మెంట్ వర్కులు, రోడ్లు, మురుగు కాల్వలు, తాగు నీటి సౌకర్య గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం నందనవనంలో రూ. 57 లక్షలు, కూటాగుండ్లలో రూ. 55 లక్షలతో జరిగిన జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా జరిగిన చెక్ డ్యాం పనులు, కుంటల పూడిక పనులు, పరిశీలించారు. 2021-22 వచ్చిన 15 ఆర్థిక సంఘ నిధులు నందనవనంలో రూ. 13 లక్షలు, కూటాగుండ్లలో రూ. 9 లక్షలు నిధులు వచ్చాయి. వీటిలో జరిగిన పనులు, రికార్డులు పరిశీలించారు. జరిగిన పనులు వద్ద నేం బోర్డులు లేవని నమోదు చేసుకున్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద నందనవనంలో 47 ఇళ్లు, కూటాగుండ్లలో 20 ఇళ్లు మంజూరు కాగా.. పూర్తయినవి బిల్లులు చేసిన ఎంబుక్‌లు, రికార్డులు పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలను, పంచాయతీలో కేంద్ర ప్రభుత్వం నిధులతో జరిగిన పనులు రోడ్లు, మురుగు కాలువలు, పనులు పరిశీలించారు. కేంద్ర విజిటింగ్ టీం కోఆర్డినేట్ బత్తుల శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లా పంచాయతీ సెక్రటరీ ఆదేశాల మేరకు తనిఖీలు చేస్తున్నామని చెప్పారు. నివేదిక తయారు చేసి అధికారులకు అందజేస్తామన్నారు. ఎంపీడీఓ జీవీ క్రిష్ణారావు, వీవోఆర్డీ షేక్ షరీఫ్, ఏఈ కొండయ్య, శ్రీకాంత్, తనిఖీ టీం సభ్యులు కిరణ్, రజినీ కాంత్, ఏపీఓ వెంకటేశ్వర్లు, ఏపీఎం నారాయణ, సర్పంచ్‌లు రామక్రిష్ణ, పరిపోగు కేపీ రావు, ఎంపీటీసీ నారాయణస్వామి పాల్గొన్నారు.